క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో తండ్రి వర్ధంతి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహన రెడ్డి తన తండ్రి వర్ధంతిని వృద్ధాశ్రమంలో ఆదివారం జరుపుకున్నారు. శ్రీ కరుణా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. తనకు జన్మనిచ్చిన తండ్రి జ్ఞాపకార్థం పలువురు వృద్ధులకు అన్నదానం చేసి సంతృప్తి పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ డైరెక్టర్ యం. కాశయ్య, బయ్యవరం పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పింఛన్‌దారులకు నేడు ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తామని స్థానిక కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ నాటికి 95 శాతం మేర పింఛన్ పంపిణీ చేస్తామని.. మిగిలిన వారికి 2వ తేదీన పంపిణీ చేస్తామని తెలిపారు.

ఘనంగా కోటి కుంకుమార్చన



కుంకుమ పూజల్లో మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. మండల కాలం నిర్వహించే ఈ పూజలు ఆదివారం పదో రోజుకు చేరాయి. మహిళలు అధిక సంఖ్యలో కోటి కుంకుమార్చన పూజల్లో పాల్గొంటున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు నారాయణం మురళీకృష్ణమాచార్యులు ఈ పూజలను నిర్వహిస్తున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను, అల్పాహారం అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, ఎస్.నాగేశ్వరరావు, మేడా నరసింహారావు, పెరుమాళ్ళ భాస్కర్, రవి, రామాపురం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా రామకృష్ణ

కంభం: స్థానిక లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా లయన్ డాక్టర్ బైసాని రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా మాజీ అధ్యక్షుడు మహబుబ్ బేగ్ ఆదివారం తెలిపారు. బైసాని రామకృష్ణ ఎల్.కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండమే కాకుండా వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా సేవలందిస్తున్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ రాజ్యాంగం ప్రకారం 2024–25 లయన్ స్టిక్ సంవత్సరానికి గాను జూలై 1వ తేదీ నుంచి అధ్యక్షుడిగా బైసాని రామకృష్ణతో పాటు నూతన కార్యవర్గంలో కార్యదర్శిగా పేర్లి గుండయ్య, కోశాధికారిగా సిరిగిరి వెంకట్రావులను ఎన్నుకున్నామని వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌ను మరింత ముందుకు వెళ్లగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాన దేవుడు కరుణిస్తాడా?



చందవరంలో రచ్చ బండపై రైతన్నల కబుర్లు



గంగదేవిపల్లిలో విత్తటానికి సిద్ధం చేసిన పొలం

దొనకొండ: రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. అప్పులు చేసి విత్తడానికి సిద్ధం చేశాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 10 రోజులు దాటింది. అయితే వాన ఎప్పుడు పడుతుందో.. పొలంలో విత్తనాలు ఎప్పుడు నాటాలో అని రైతన్న వాన కోసం ఎదురు చూస్తున్నారు. కంది, ఆముదాలు, పత్తి విత్తనాలు విత్తడానికి దూర ప్రాంతమైన వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్ళి వేలకు వేలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి ఇళ్ళల్లో పెట్టుకున్నారు. పల్లెల్లో ఏ పనులు లేక చెట్ల కింద, రచ్చ బండ వద్ద, దేవాలయాల వద్ద రైతన్నలు ముచ్చటలాడుకుంటున్నారు. దొనకొండ ప్రాంతంలో వర్షాధార పంటలు ఎక్కువ భాగం సాగు చేస్తారు. మే నెలలో కాసిన ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి చెరువులు, కుంటలు ఎండి పోయాయి. మరి కొద్ది రోజులు ఇలానే ఉంటే ఖరీఫ్ సీజన్ కూడా దాటి పోతుంది. పంటలు పండకపోతే ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. నోరు లేని గేదెలకు పశుగ్రాసం, తాగు నీరు కరువై పోతుంది. ట్రాక్టర్ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు ధర పలుకుతుంది. ఈ ఏడాది గడ్డు పరిస్థితి ఏర్పడేలా ఉందని, ఏ పంటలు పండుతాయో, ఏమి తిని బతకాలో, ఎలా అప్పులు తీర్చాలో, శుభకార్యాలు ఎలా చేయాలో అంటూ రైతన్నలు డీలా పడ్డారు. ఏ గ్రామం చూసినా, ఏ రైతన్నను పలకరించినా కాలం సరిగా లేదంటూ దిగాలు పడుతున్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్ షెల్టర్ లేని కంభం సెంటర్



దోర్నాల సెంటర్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో వివిధ కేంద్రాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు నిలిపే దోర్నాల సెంటర్, కంభం సెంటర్, కోర్టు సెంటర్‌లో బస్‌షెల్టర్లు లేవు. మార్కాపురం డిపోలో 98 బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ చేరవేస్తుంటాయి. కంభం సెంటర్‌లో కంభం, నంద్యాల, కడప, ప్రొద్దుటూరు, గిద్దలూరు వెళ్లే దూర ప్రాంత ప్రయాణికులతో పాటు చింతగుంట్ల, జంగంగుంట్ల, జమ్మనపల్లె, గొట్టిపడియ, కోల భీమునిపాడు వెళ్లే ప్రయాణికులు ఈ సెంటర్‌లో ఆగుతారు. దోర్నాల సెంటర్‌లో త్రిపురాంతకం, వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, యర్రగొండపాలెం, మాచర్ల, హైదరాబాదు, దోర్నాల, శ్రీశైలం, కర్నూలు, ఆత్మకూరు వెళ్లే ప్రయాణికులతో పాటు దగ్గర గ్రామాలైన దేవరాజుగట్టు, పెద్దారవీడు, గొబ్బూరు, తోకపల్లెగ్రామాల ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. కోర్టు సెంటర్‌లో ఒంగోలు, పొదిలి, నెల్లూరు, తిరుపతి వెళ్లే ప్రయాణికులతో పాటు కలుజువ్వలపాడు, కొనకనమిట్ల, రైల్వేస్టేషన్, గజ్జలకొండ తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉంటారు. ఈ ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్ల నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడిమికి తట్టుకోలేక దగ్గరలో ఉన్న షాపుల పంచన ఆశ్రయం పొందాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, దాతల సహకారంతో బస్‌షెల్టర్లను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పార్టీలకతీతంగా పథకాలు చేరవేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేద్దామని జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఆదివారం ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజలకు అండగా ఉండి పార్టీలకతీతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని, జూనియర్ కళాశాలను నిలుపుకునేందుకు ప్రతి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 5 మంది విద్యార్థులను చేర్పించాలన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూడా ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. మండలంలోని ప్రజల సమస్యలను సమష్టిగా పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో శానిటేషన్ విషయంలో ప్రతి పంచాయతీ కార్యదర్శి అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేవని, ఇంటి పన్నులు వసూలుకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. గ్రామాల్లోని సమస్యల పట్ల వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినుకొండ నుంచి రాత్రి 9 గంటలకు కురిచేడు ఆర్టీసీ బస్సు నడపాలని, మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యంకల్పించాలని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేనూతల కాటమరాజు స్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో వెలిసిన అంకాళమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి స్వామి, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ, పసుపుతో పూజించి, పట్టు వస్త్రాలు, నిమ్మకాయలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి సమర్పించారు. కాటమరాజుస్వామి దేవాలయం ప్రాంగణంలో యాదవులు భక్తిశ్రద్ధలతో స్వామి చుట్టూ బొల్లావును నెత్తిన పెట్టుకుని తప్పెట్లతో ఊరేగింపుగా అనందోత్సవంతో ప్రదక్షిణలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, కాయ కర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

యూనిట్ అధ్యక్షునిగా రంగయ్య



నూతనంగా ఎన్నికైన సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన ఎన్నికల కమిటీ ఎంపిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా వైపీ రంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సందాని జాని బాష, సహ అధ్యక్షుడిగా విజయభాస్కర్ రెడ్డి, కోశాధికారిగా రాణాప్రతాప్‌లను 17 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్‌వీ రమణారెడ్డి, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఏపీ రంగారెడ్డి, పరిశీలకులుగా సయ్యద్ మసూద్ అలీ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తుల సమస్యల కోసం అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తుల సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి సన్మానించారు. విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ ఆదాంసాహెబ్, అరిగెల వెంకటరామయ్య, లక్ష్మీదేవి, ఫరిదా, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెంకట కృష్ణ యాదవ్ సేవలు ప్రశంసనీయం



సమావేశంలో ఎమ్మెల్యే, వెంకట కృష్ణ యాదవ్ దంపతులు

గిద్దలూరు రూరల్: మండలంలోని అంకణాంపల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నక్కా వెంకట కృష్ణ యాదవ్ పదవీ విరమణ మహోత్సవాన్ని పట్టణంలోని విశా సుబ్బరత్నం కల్యాణమండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయసమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ప్రధానోపాధ్యాయుడు వెంకట కృష్ణ యాదవ్ చేసిన సేవలను గురించి కొనియాడారు. యాదవ ఉపాధ్యాయుల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్, జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు, లెక్చరర్ నంద్యాల శ్రీనివాసులు, కటూరు శ్రీనివాసులు, గుర్రం క్రిష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్గదర్శకుడు శంకర రెడ్డి



శంకరరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలిచిన శంకరరెడ్డి సేవలు మరువలేనివని ఎంఈఓలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్ అన్నారు. మండలంలోని గంగపాలెం ఎంపీపీఎస్(డేవిడ్ మేరీ స్కూల్)లో ఉపాధ్యాయుడిగా సేవలు అందిసస్తూ ఆదివారం పదవీ విరమణ చేసిన శంకరరెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. వారు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడిలో సమయపాలన, విద్యార్థులను మహోన్నత శిఖరాలు అధిష్ఠించే విధంగా తీర్చిదిద్దడం వంటి సేవలు అందించాలని, అప్పుడే తాము చేపట్టిన వృత్తికి సార్థకత ఉంటుందన్నారు. విద్యార్థుల శ్రేయస్సే తన పరమావధిగా భావించే శంకరరెడ్డి పంతులును నేటి యువ ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు. అనంతరం పదవీ విరమణ చేసిన శంకరరెడ్డి దంపతులకు శాలువలు కప్పి, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు సుబ్బాయమ్మ, ఉపాధ్యాయులు కాళంగి శ్రీనివాస్, శామ్యూల్, వెంకటేశ్వర్లు, అప్పారావు, లక్ష్మీనారాయణ, చెన్నయ్య పాల్గొన్నారు.

ముగిసిన రామాలయ వార్షికోత్సవం



పోలేరమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల సందడి



కుంకుమ బండి

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు(దక్షిణం పల్లి) గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సహిత రామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవాన్ని గత మూడు రోజులుగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం పోలేరమ్మ తల్లి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు కుంకుమ బండ్లు కట్టి గ్రామోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



అల్లూరి పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పు అల్లూరి పోలేరమ్మ తల్లిని ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. నాగ శిలలు, పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

యువతకు దేశభక్తి అవసరం

– శివసేవక్ శివకరణ్



మాట్లాడుతున్న శివకరణ్

మార్కాపురం టౌన్: యువతకు దేశభక్తి అవసరమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివసేవక్ శివకరణ్ అన్నారు. 2022 మార్చి 25 నుంచి దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న ఆయన ఆదివారం మార్కాపురం వచ్చిన సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో ప్రారంభమైన తన పాదయాత్ర, హర్యాణా, రాజస్థాన్, ఛండీఘడ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, జమ్మూ కశ్మీర్ మీదుగా కొనసాగిందన్నారు. గంగా, యమునా లాంటి పవిత్ర నదులకు హారతులిస్తూ కొనసాగుతున్న తన యాత్ర ఏపీ నుంచి రామేశ్వరం మీదుగా కన్యాకుమారి వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయాలు, కార్యాలయాల వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, దేశం కోసం జీవిస్తూ.. దేశం కోసం మరణించాలన్నారు. సైనికుల త్యాగాలు మరువలేమన్నారు. దేశ సంస్కృతిని గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వీరారావు, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న గుంటక వనజాక్షి, కౌన్సిలర్ హర్షిత తదితరులు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణంలోని 16వ బ్లాక్, భగత్‌సింగ్ కాలనీలో ఏపీఎస్ఎస్ఎస్ మహిళా స్వచ్ఛంద సేవా అధ్యక్షుడు కవలకుంట్ల ఝాన్సీకి ఆదివారం సాయంత్రం భగత్‌సింగ్ కాలనీలో మార్కాపురం పట్టణానికి చెందిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో 16వ బ్లాక్ కౌన్సిలర్ దారివేముల హర్షిత రెండు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుంటక వనజాక్షి మాట్లాడుతూ.. సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా కుట్టుమిషన్లను అందిస్తున్నట్లు తెలిపారు. 16వ బ్లాక్ కౌన్సిలర్ హర్షిత మాట్లాడుతూ.. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరె వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుంటక చెన్నారెడ్డి, నూకాని సుజాత, పి.స్వప్న, ఎస్.లీలావతి, ఒ.భాగ్యలక్ష్మి, కె.మల్లీశ్వరి, కె.భాగ్యలక్ష్మి, సీహెచ్ కృష్ణవేణి, వై.శ్యామల, వై.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు–కర్నూలు రోడ్డు జలమయం



ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

పొదిలి: పట్టణంలోని ఒంగోలు–కర్నూలు రహదారిపై వర్షం నీరు భారీగా నిలిచిపోయింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డంతా జలమయమయింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వర్షం నీరు అధికంగా ఉండటంతో ద్విచక్రవాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక కొంత సేపు పక్కదారుల గుండా రాకపోకలు సాగించారు. పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో వేగానికి నీరంతా చిందిపోయి దుకాణాలు, పాదచారులపై పడింది. అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లు అభివృద్ధి చేసి నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం



మాట్లాడుతున్న విజయలక్ష్మి

పొదిలి: కాంగ్రెస్ పాలనలో విధించిన అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) భారత ప్రజాస్వామ్యంలో ఓ చీకటి అధ్యాయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం పొదిలిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అప్పటి చీకటి రోజుల గురించి ప్రస్తావిస్తున్నట్లు తెలిపారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న రోజుల్లో ప్రజాస్వామ్యాన్ని కాలరాసి, ఎమర్జెన్సీ విధించారన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుండేలా మోదీ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఆస్త ప్యాలెస్‌లో పీఎం నరేంద్రమోదీ చేపట్టిన మన్‌కీ బాత్ 111వ ఎపిసోడ్‌ను బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు, మాగులూరి రామయ్య, పువ్వాడ నారాయణ, సూరెడ్డి శ్రీనివాసరెడ్డి, కిలారి శ్రీనివాసరావు, దాసరి లక్ష్మి, ఆకుపాటి లక్ష్మణ, కొక్కెర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.